
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం


మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 6 | గురువారం 1 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-

# ఏపీపై కాంగ్రెస్ ఫోకస్



ఏపీపై కాంగ్రెస్ హై కమాండ్ ఫుల్ ఫోకస్

వచ్చే ఎన్నికల నాటికి బలంగా ఉనికి చాటాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ

ఎందుకంటే ఏపీ అసెంబ్లీతో పాటే సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి.


ఆ సమయానికి పార్టీ బలం పుంజుకునేలా చేయాలన్నది అధినాయకత్వం ఆలోచన

ముఖ్యంగా ఏపీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రియాంక గాంధీ చూస్తున్నారు

ఆమె నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది

క్షేత్రస్థాయిలో పరిణామాలను ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తున్నట్లు సమాచారం

3



## ఆపరేషన్ సిందూర్‌తో డీఆర్డీవో ఆయుధాల సత్తా ఏంటో అందరికీ తెలిసింది

- డీఆర్డీవో 68వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్
- ఆపరేషన్ సిందూర్‌లో డీఆర్డీవో ఆయుధ వ్యవస్థలది కీలక పాత్ర అని ప్రశంస
- 'సుదర్శన చక్ర' రూపకల్పన బాధ్యత డీఆర్డీవోదేనని వెల్లడి
- రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌ను సంస్థ బలోపేతం చేస్తోందని వ్యాఖ్య
- ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించాలని సూచన

# 2025 సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త అధ్యాయం

2025లో ఏపీ ప్రస్థానంపై జాతీయ మీడియాలో ప్రత్యేక కథనం

ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన


తిరిగి ప్రారంభమైన అమరావతి రాజధాని నిర్మాణ పనులు

విశాఖలో గూగుల్ భారీ డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటన

రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ఆకర్షణ

ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రభుత్వ ప్రణాళికలు

'సూపర్ సిక్స్' హామీల అమలుతో పరుగులు తీస్తున్న సంక్షేమం




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

2025 సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించింది. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం... అమరావతి రాజధాని నిర్మాణ పనులను పునఃప్రారంభించడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ప్రయాణం వంటి కీలక పరిణామాలకు ఈ ఏడాది సాక్ష్యంగా నిలిచింది. ఎన్నికల హామీకి అనుగుణంగా రాజధాని పనులను పట్టాలెక్కించడం ఈ ఏడాదికే తలమానికంగా నిలిచింది. ఈ మేరకు జాతీయ మీడియా సంస్థ ఐఏఎన్ఎస్ ఓ కథనం వెలువరించింది. దాదాపు పదేళ్ల క్రితం ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన - మిగతా3లో



## ఫేక్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు రద్దు

నూతన ఏడాది రైతులకు కొత్త సంవత్సర కానుక

22ఏ జాబితా నుండి ఐదు రకాల భూముల తొలగింపు

రెండు నెలల్లో ఫ్రీ హోల్డ్ భూములపైనా నిర్ణయం

ఫైల్‌పై సంతకం చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

రాష్ట్ర ప్రజలకు రెవెన్యూ శాఖ కొత్త సంవత్సర కానుక నిచ్చింది. 22ఏ జాబితాలో ఉన్న 5 రకాల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించింది. ఈమేరకు రాష్ట్ర రెవెన్యూ,రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ కొత్త సంవత్సరంలో తొలి ఫైలుపై సంతకం చేశారు. - మిగతా3లో



## ఫాస్టాగ్‌లపై కేంద్రం శుభవార్త... వాహనదారులకు భారీ ఊరట

- కార్లు, జీపులు, వ్యాన్ల ఫాస్టాగ్‌లకు కేవైసీ ప్రక్రియను రద్దు చేసిన ఎన్ హెచ్ఏఐ
- ఫిబ్రవరి 1నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనలు
- ఫిర్యాదులు వస్తే తప్ప పాత ఫాస్టాగ్‌లకు కూడా కేవైవీ అవసరం లేదన్న సంస్థ
- యాక్టివేషన్‌కు ముందే వాహన్ డేటాబేస్‌తో వివరాల వెరిఫికేషన్
- ఫాస్టాగ్ జారీ చేసే బ్యాంకులకే పూర్తిస్థాయి ధృవీకరణ బాధ్యత

## అత్యాధునిక హంగులతో వందే భారత్ స్లీపర్

తొలి రైలు పరుగులు పెట్టేది ఈ రూట్‌లోనే..!

గువాహటి–కోల్‌కతా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలు

త్వరలోనే జెండా ఊపి ప్రారంభించనున్న ప్రధాని మోదీ

మొత్తం 16 కోచ్‌లు.. 823 మంది ప్రయాణించేలా ఏర్పాట్లు

3 ఏసీ టికెట్ ధర సుమారు రూ. 2,300గా నిర్ణయం



## రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం... డిసెంబరులో భారీ వసూళ్లు




- 2025 డిసెంబరులో రూ.1.74 లక్షల కోట్ల జీఎస్టీ వసూళ్లు
- 2024 డిసెంబరుతో పోలిస్తే 6.1 శాతం వృద్ధి నమోదు
- పన్ను రేట్ల తగ్గింపు ఉన్నప్పటికీ పెరిగిన వసూళ్లు
- ఫిబ్రవరి 1 నుంచి పొగాకు ఉత్పత్తులపై కొత్త పన్నుల విధానం

## చంద్రబాబు ఒక రాజనీతిజ్ఞుడు

కేసీఆర్ విమర్శలు దుర్మార్గం: ఏపీ మంత్రి ఆనం

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌పై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఫైర్

కూటమి ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు దుర్మార్గమైనవని వ్యాఖ్య

కేసీఆర్‌కు నచ్చితే ఎంత, నచ్చకపోతే ఎంత అంటూ ఫైర్

చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో రామరాజ్యం మొదలైందన్న ఆనం

ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని ఆరోపణ



# 2025 సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక కొత్త అధ్యాయం

-మొదటిపేజీ తరువాయి


అమరావతి పనులను, 2025 మే 2న ఆయన చేతుల మీదుగానే మళ్లీ ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన కలల ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు తీసుకెళ్తున్నారు. హైకోర్టు, శాసనసభ, సచివాలయం, హెచ్‌ఓడీ టవర్ల వంటి రూ. 56,000 కోట్ల విలువైన ప్రాజెక్టుల పనులు తిరిగి మొదలయ్యాయి. 2028 మార్చి నాటికి ఈ పనులు పూర్తిచేస్తామని సీఎం ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో అమరావతిలో రెండో దశ భూ సమీకరణకు కూడా శ్రీకారం చుట్టారు. అమరావతిని అమెరికాలోని సిలికాన్ వ్యాలీ తరహాలో 'క్వాంటమ్ వ్యాలీ'గా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలను ప్రభుత్వం ప్రకటించింది.

రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహంలో విశాఖపట్నంలో గూగుల్ తన అతిపెద్ద డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడం ఒక మైలురాయిగా నిలిచింది. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ తన కథనంలో పేర్కొన్న ప్రకారం, ఈ పరిణామం విశాఖ రూపురేఖలను మార్చేస్తుందని ఐటీ మంత్రి నారా లోకేశ్ అభిప్రాయపడ్డారు. గూగుల్ ఐదేళ్లలో పెట్టనున్న 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో 1.88 లక్షల మందికి ఉపాధి లభించనుంది. గత 16 నెలల్లో రాష్ట్రం 120 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 10 లక్షల కోట్లు) పెట్టుబడులను ఆకర్షించిందని ప్రభుత్వం ప్రకటించింది. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో ఏకంగా రూ. 13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 610 ఎంఓయూలు కుదిరాయి.

రాష్ట్రంలో మూడు ఆర్థిక కారిడార్లను అభివృద్ధి చేస్తూ 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. విశాఖపట్నం, అమరావతి, రాయలసీమ ప్రాంతాల్లో ఈ కారిడార్లు ఏర్పాటు కానున్నాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించాలన్న 'సూపర్ సిక్స్' హామీని నిలబెట్టుకునే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సంక్షేమ రంగంలోనూ ప్రభుత్వం తనదైన ముద్ర వేసింది. 'తల్లికి వందనం' పథకం కింద 67.27 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,090 కోట్లు అందించారు. ఆగస్టు 15న ప్రారంభించిన 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. అలాగే, 'అన్నదాత సుఖీభవ' కింద 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 6,310 కోట్లు జమ చేశారు. ఎన్టీఆర్ భరోసా కింద 63 లక్షల మందికి ఏటా రూ. 33,000 కోట్ల పింఛన్లు అందిస్తున్నారు. పరిపాలనలో పారదర్శకత కోసం వాట్సాప్ గవర్నెన్స్, విపత్తుల నిర్వహణలో డేటా ఆధారిత నిర్ణయాలు వంటి ఆధునిక పద్ధతులను ప్రభుత్వం అనుసరిస్తోంది. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దే లక్ష్యంతో 'పీ4' (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని ప్రారంభించడం ఈ ఏడాదిలోని మరో విశేషం. మొత్తం మీద 2025 సంవత్సరం అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ ప్రణాళికలతో ఏపీకి ఒక బలమైన పునాది వేసింది.

# ఏపీని భయపెడుతున్న స్క్రబ్ టైఫస్..
# 2 వేలకు పైగా పాజిటివ్ కేసులు..

**కాకినాడ :** ఆంధ్రప్రదేశ్‌లో స్క్రబ్ టైఫస్ వ్యాధి కలకలం రేపుతోంది. ఇప్పటికే 22 మంది మరణించగా.. గడిచిన రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2 వేలకు పైగా కేసులు నమోదయ్యాయి. చిత్తూరు జిల్లాలో అత్యధిక కేసులు నమోదవుతుండగా.. తర్వాత స్థానాల్లో తిరుపతి, కాకినాడ, విశాఖపట్నం జిల్లాలు ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఇక్కడ కూడా స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయి. అపరిశుభ్రత, అవగాహన లోపమే దీనికి కారణమని నిపుణులు చెబుతున్నారు. సకాలంలో గుర్తిస్తే ప్రాణాపాయం ఉండదని వైద్యులు సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్క్రబ్ టైఫస్ వ్యాధి వణికిస్తోంది. రోజురోజుకు రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ కేసులు, మరణాలు గణనీయంగా పెరుగుతున్నాయి. అయితే ఏపీలో స్క్రబ్ టైఫస్ కేసులు గత రెండు సంవత్సరాల నుంచే నమోదవుతున్నా... అధికారికంగా మరణాలు సంభవించినట్లు వివరాలు లేవు. కానీ ఈ సంవత్సరం మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇప్పటి వరకు ఏపీలో స్క్రబ్ టైఫస్ బారిన పడి 22 మంది మరణించారు. గత రెండేళ్ల నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 2 వేలకు పైగా పాజిటివ్ కేసులు నమోదు కాగా... అత్యధికంగా చిత్తూరు జిల్లాలో ఎక్కువ కేసులు నమోదయ్యాయి. రెండేళ్ల నుంచి ఏపీలో స్క్రబ్ టైఫస్ కేసులు నమోదు అవుతున్నాయి. 2023లో 548, 2024 సంవత్సరంలో 514 కేసులు నమోదు కాగా... ఈ సంవత్సరం ఇప్పటి వరకు 491 కేసులు నమోదయ్యాయి. మరో వైపు తిరుపతి జిల్లాలోనూ కేసులు పెరుగుతున్నాయి.



కాకినాడ, విశాఖపట్నం జిల్లాలు కూడా ఆందోళనకర సంఖ్యలో స్క్రబ్ టైఫస్ కేసులు పెరుగుతున్నాయి.పరిసరాల అపరిశుభ్రత, అవగాహన లేమి స్క్రబ్ టైఫస్ వ్యాప్తికి ప్రధాన కారణాలు అంటున్నారు. అయితే స్క్రబ్ టైఫస్ వ్యాధిని సకాలంలో గుర్తిస్తే పెద్దగా సమస్య ఉండదని వైద్యులు చెబుతున్నారు. కానీ చాలామంది జ్వరానికి వాడే సాధారణ మందులు వాడి, పరిస్థితి తీవ్రమయ్యాకే ఆసుపత్రులకు వెళుతున్నారని తెలిపారు. అందువల్లే ప్రాణాపాయం ఏర్పడుతోంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, వ్యాధి నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవడం చాలా ముఖ్యం అంటున్నారు నిపుణులు.అపరిశుభ్ర పరిసరాలు, వ్యవసాయ ప్రాంతాలు, తేమ ఎక్కువగా ఉండే పొదల్లో తేవీటి పురుగు (చిగ్గర్ మైట్) ఎక్కువగా తిరుగుతుంది. దీని కాటు వల్లే స్క్రబ్ టైఫస్ వస్తుంది. ఈ పురుగు కొత్తది కాదని, ఏళ్లుగా ఉందని నిపుణులు చెబుతున్నారు. అయితే గత కొన్నాళ్లుగా ఈ పురుగు ఎందుకు ప్రమాదకరంగా మారిందనేది నిపుణులకు ఇంకా అంతుచిక్కడం లేదు. దేశవ్యాప్తంగా స్క్రబ్ టైఫస్ కేసులు నమోదవుతున్నా... ఆంధ్రప్రదేశ్‌లోనే మరణాలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.స్క్రబ్ టైఫస్ కేసులు మరింత పెరుగుతుండటంతో... దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేయడానికి, బ్యాక్టీరియాలోని రకాలను గుర్తించడానికి జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఒక అంటువ్యాధి ప్రజారోగ్యానికి సవాలుగా మారుతున్న నేపథ్యంలో... వైద్య రంగ నిపుణులను సలహాదారులుగా నియమించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తాజాగా, అంటువ్యాధుల నివారణకు జాతీయ వైద్య సంస్థలు, కీలక రంగాల నిపుణులతో ఒక ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఈ టాస్క్‌ఫోర్స్ వ్యాధి నియంత్రణకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తుంది.

# నాల్కో ప్రకటనతో గిరిజనుల ఆందోళన

**విజయనగరం :** ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దులోని కొటియా వివాదస్పద గ్రామాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొటియా ప్రాంతంలో బాక్సైట్ తవ్వకాలు ప్రారంభిస్తామంటూ నాల్కో కంపెనీ చేసిన ప్రకటనతో అక్కడి గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివాదాల్లో ఉన్న కొటియా భూభాగం ఏ రాష్ట్రానికి చెందిందో క్లారిటీ లేకుండా ఒరిస్సా అనుమతులు ఇవ్వడంపై కొటియావాసులు ఆందోళనకు దిగుతున్నారు. కొటియా ప్రాంతంలో ఎలాంటి కార్యకలాపాలు జరపకూడదని సుప్రీంకోర్టు స్టేటస్-కో ఉన్నప్పటికీ బాక్సైట్ తవ్వకాలు ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా, ఒడిశాలోని కోరాపుట్ జిల్లా సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంతం అత్యంత విలువైన ప్రాంతం. ఈ ప్రాంతంలోని 22 గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందుతాయన్నది దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం. ఈ భూభాగం తమదంటే తమదంటూ ఇరు రాష్ట్రాలు కోర్టు మెట్లక్కాయి. దీంతో భూభాగం ఏ రాష్ట్రానికి చెందిందో పార్లమెంట్ నిర్ణయం తీసుకోవాలని అప్పటి వరకు ఈ ప్రాంతంలో ఇరు రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం కూడా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకూడదని 1968 డిసెంబర్ 2న సుప్రీంకోర్టు స్టేటస్-కో ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి యథాతథ స్థితి కొనసాగాల్సి ఉంది. అలా ఈ ప్రాంతవాసులకు ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు ఇవ్వొచ్చు కానీ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం మాత్రం కుదరదు. అలా ఇచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఏపి ప్రభుత్వం అమలుచేస్తుంది.. కానీ ఒరిస్సా ప్రభుత్వం మాత్రం కోర్టు తీర్పుకు విరుద్దంగా.. కొటియాను అన్నివిధాలా అభివృద్ధి చేస్తూ తమ అధీనంలోకి తీసుకునేలా దూకుడుగా ముందుకు వెళ్తుంది. ఇక్కడ ఉన్న 22 గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వ భవనాలు, రోడ్లు ఇతర మౌలిక వసతులు కల్పిస్తూ ముందుకు వెళ్తుంది. అలాగే ఏపీ అధికారులు, ప్రభుత్వ సిబ్బంది ఈ ప్రాంతంలో ఏమైనా ప్రభుత్వ పథకాల కోసం వెళ్తే వారిని కొటియా గ్రామాల నుండి బలవంతంగా వెనక్కి పంపిస్తుంది. పలువురుపై కేసులు కూడా పెడుతుంది. ఈ క్రమంలోనే కొటియావాసులు సైతం తాము ఏపీతో ఉంటామని ఒడిశాలో ఉండమని ఆందోళనలు చేపడితే.. అలా ఆందోళనకు దిగిన వారిపై సైతం కేసులు పెడుతుంది ఒడిశా ప్రభుత్వం. అలా ఎప్పటికప్పుడు కొటియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఇప్పుడు తాజాగా బాక్సైట్ గనుల అంశం మళ్లీ కొటియాలో ఉద్రిక్త పరిస్థితులకు దారితీస్తుంది. 2026 కొత్త సంవత్సరంలో కొటియా సమీపంలోని పొట్టంగి ప్రాంతంలో సుమారు 660 హెక్టార్లు, అంటే దాదాపు 1750 ఎకరాల్లో నాల్కో సంస్థకు బాక్సైట్ తవ్వకాలు ప్రారంభించేందుకు ఒడిశా ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో కొటియా ప్రాంత గిరిజనుల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. కొటియా పరిధిలో నివసిస్తున్న గిరిజనుల్లో ఒక్కసారిగా భయం నెలకొంది. బాక్సైట్ తవ్వకాలు జరిగితే తమ గ్రామాల పరిస్థితి ఏంటి? పోడు వ్యవసాయం చేసుకొని బ్రతుకుతున్న తమ భూములు పరిస్థితి ఏంటి? తమ అటవీ హక్కులు, జీవనాధారం ఏమవుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తవ్వకాలు ఎలా చేస్తారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకు ఒడిశా ప్రభుత్వం ఎలా అనుమతిస్తుంది అని నిలదీస్తున్నారు.తవ్వకాలు చేస్తే మేం ఎక్కడికి వెళ్లాలి? ప్రభుత్వం మాకు ముందుగా చెప్పాలి కదా అని నిలదీస్తున్నారు. ఇదిలా ఉండగా, నాల్కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బ్రిజేంద్ర ప్రతాప్ సింగ్ వచ్చే జూన్ నాటికి బాక్సైట్ తవ్వకాలను ప్రారంభించాలన్న లక్ష్యంతో ఉన్నామని వెల్లడించారు. ఒడిశాలోని పొట్టంగి ప్రాంతంలో బాక్సైట్ గనుల అభివృద్ధి ద్వారా అల్యూమినియం వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. గనుల అభివృద్ధి బాధ్యతలను దిలీప్ బిల్డ్‌కాన్ సంస్థకు కూడా అప్పగించినట్టు చెప్పారు. కోరాపుట్ జిల్లా దామనోడి అల్యూమినా రిఫైనరీ సామర్థ్యాన్ని ప్రస్తుత 22.75 లక్షల టన్నుల నుంచి మరో 10 లక్షల టన్నులకు పెంచాలని నాల్కో లక్ష్యంగా పెట్టుకుంది. ముడి పదార్థాల కోసం ఒడిశా ప్రభుత్వం నుంచి సుమారు 697 హెక్టార్ల భూమిని 50 సంవత్సరాలకు లీజుకు తీసుకున్నట్టు వెల్లడించారు. అలా నాల్కో చైర్మన్ ఇచ్చిన స్టేట్మెంట్ తో గిరిజనులు ఆందోళనలో పడ్డారు. సుప్రీంకోర్టు స్టేటస్‌కో ఉన్న కొటియా పరిధిలో ఈ తవ్వకాలు చట్టబద్ధమేనా? 22 గ్రామాలపై ఎలాంటి ప్రభావం పడనుంది? అటవీ హక్కుల చట్టం, గ్రామసభ అనుమతులు తీసుకున్నారా? లేదా? అవేమీ లేకుండా నాల్కో సంస్థకు ఎలా అనుమతులు ఇచ్చింది? నాల్కో సంస్థ ఎలా త్రవ్వకాల పై ప్రకటిస్తుంది? అన్న అనేక అంశాల పై ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదు. అయితే మరోసారి దూకుడుగా వెళ్తున్న ఒడిశా ప్రభుత్వ వ్యవహారం పై ఏపి ప్రభుత్వం స్పందించాలని అంటున్నారు ఏపి మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర. ఏపికి చెందిన భూములను ఒడిశా ఎలా అనుమతులు ఇస్తుంది? సుప్రీంకోర్టు స్టేటస్ కో ఉన్నప్పటికీ ఒడిశా ఎలా ఏకపక్షంగా వ్యవహరించి నాల్కో సంస్థకు బాక్సైట్ తవ్వకాలకు అనుమతి ఇస్తారు అని మండిపడుతున్నారు.

## కొత్త ఏడాది కొత్త వ్యూహాలు

**విజయవాడ :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత కన్నూమిన్నూ కానరాలేదు. కొత్త విధానాలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఎవరి సలహాయో తెలియదు కాని సోషల్ ఇంజినీరింగ్ పేరుతో ప్రధానమైన కులాలను తమ వైపునకు తిప్పుకోవాలని జగన్ ప్రయత్నించారు. అందుకే అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నామస్మరణలు చేస్తూ మిగిలిన సామాజికవర్గాలను మర్చిపోయారన్నది వైసీపీ నేతలే చేస్తున్న విమర్శ. అందుకే రాష్టరంలోని కొన్ని బలమైన సామాజికవర్గాలు పార్టీకి దూరమయ్యాయని, ఫలితంగానే పదకొండు సీట్లకు పరిమితమయ్యాయని వారు బాహాటంగా చెబుతున్నారు. లబ్దిదారుల ఎంపికతో పాటు నగదు బదిలీకి కూడా ప్రథమ ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే జగన్ పార్టీ మొన్నటి ఎన్నికల్లో విఫలమయిందంటున్నారు?వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కుల రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నించేసింది. అన్ని కులాలను దగ్గరకు తీసుకోవాలన్న లక్ష్యంతో ప్రధాన సామాజికవర్గాలకు దూరమయింది. ఎన్నికల్లో అన్ని రకాలుగా పార్టీకి ఉపయోగపడిన వారిని మాత్రం పక్కన పెట్టింది. మరొక వైపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నినాదంచేస్తూనే సామాజిక న్యాయం వైపు అడుగులు వేస్తున్నట్లు కనిపించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మంత్రి పదవులు ఇవ్వడం, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా అణగారిన వర్గాల్లో ఒక కొత్త ఆశను రేకెత్తించింది. కానీ అసలైన నిర్ణయాధికారం, ఆర్థిక లావాదేవీలు, పార్టీ యంత్రాంగంపై పట్టు మాత్రం రెడ్డి సామాజికవర్గం చేతుల్లోనే కేంద్రీకృతమై ఉండటంతో వారు కూడా ఎన్నికల నాటికి దూరమయ్యారుఅటు కాకుండా ఇటు కాకుండా అయినట్లయింది వైసీపీ పరిస్థితి. అందుకే ఎక్కువ మంది వైసీపీ నేతలు ఇప్పుడు వాస్తవంలోకి జగన్ వస్తేనే పార్టీని ప్రజలు ఆదరిస్తారంటున్నారు. బీసీ నినాదం ఎంతగా ఎత్తుకున్నా మొన్నటి ఎన్నికల్లో ఫలితం లేకుండా పోయిందని సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. లేకుంటే అదే రకమైన వ్యూహాలతో వెళితే ఈసారి కూడా భంగపాటు తప్పదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఒకవైపు క్యాడర్ లో ఆత్మవిశ్వాసం నింపుతూ మరొకవైపు అన్ని సామాజికవర్గాలను దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేయడంతో పాటు రాజకీయాలను వ్యాపారంగా మార్చవద్దని కూడా చాలా మంది జగన్ కు సూచిస్తున్నారు. అలా అయితేనే పార్టీకి భవిష్యత్ ఉంటుందని, లేకుంటే ఉండదన్న హెచ్చరికలు బలంగా వినిపిస్తున్నాయి.




## ఫేక్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు రద్దు

-మొదటిపేజీ తరువాయి

అనంతరం సచివాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతులకు, భూయజమానులకు ఉపశమనం కల్గించాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంతో గురువారం ఐదు రకాల భూములను 22ఎ జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. మరో నాలుగు రకాల భూములపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో చర్చించి వెనువెంటనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మాజీ, ప్రస్తుత సైనికోద్యోగులకు మరియు స్వాతంత్ర్య సమర యోధులకు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 18.06.1954 కు ముందు అసైన్ చేసిన భూములు, ప్రయివేట్ పట్టా భూములను 22ఎ జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. అదే విధంగా కొంత భూమి కోసం ఆ సర్వె నెంబర్ లో ఉన్న మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంచితే ఆ కొంత భూమిని సబ్ డివిజన్ చేసి దాన్ని మాత్రమే నిషేధిత జాబితాలో ఉంచి మిగిలిన భూమి నంతా కూడా నిషేధిత జాబితా నుండి తొలగించినట్లు చెప్పారు. అయితే షరతులగల పట్టా భూములు, సర్వీసు ఇనామ్ భూములు, గతంలో నిషేధిత జాబితా నుండి తొలగించినప్పటికీ రీ సర్వే సమయంలో మరలా 22ఎలో చేర్చిన చుక్కల భూములు, గతంలో 22ఎ జాబితా నుండి తొలగించని చుక్కల భూములపై వెనువెంటనే గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశాన్ని నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. అయితే ఐదు రకాల భూములకు సంబంధించి దాదాపు ఎనిమిది రకాల పత్రాల్లో ఏ ఒక్క పత్రమున్నా 22 ఎ జాబితా నుండి తొలగించాలని అన్నారు. భూ కేటాయింపుల కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫార్సుల రిజిస్టర్ లేదా 10(1) రిజిస్టర్, అడంగల్స్, ఎస్ఎఫ్ఎ లాంటి పాత రెవెన్యూ రికార్డులు లేదా ఎసైన్మెంట్ రిజిస్టర్లు లేదా డీఆర్ దస్త్రాలు లేదా రికార్డ్ ఆఫ్ హోల్డింగ్స్ లేదా రిజిస్ట్రేషన్ పత్రాలు లేదా 8ఎ రిజిస్టర్లు లేదా డికెటీ పట్టాల్లో ఏదైనా ఒకటి ఉన్నా 22 ఎ జాబితా నుండి తొలగించాలన్నారు. అధికంగా పత్రాలు కావాలంటూ భూయజమానులను తిప్పుకొవద్దని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూములపైనా ఇప్పటికే జీవోఎం చాలా సార్లు చర్చించిందని, రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వం, వైసీపీ నేతలు పెద్ద ఎత్తున భూ అక్రమాలకు పాల్పడ్డారని, వాటిన్నింటిపైనా గత ఏడాదిన్నర కాలం నుండి సమగ్రంగా విచారణ చేయిస్తాన్నామని చెప్పారు. ఈ ఏడాదిలో అప్పుడు భూ అక్రమాలకు పాల్పడిన వారందరు ఫలితం అనుభవిస్తారని అన్నారు. గత ఏడాది నకిలీ మద్య నామ సంవత్సరంగా సాగిందని, నకిలీ మద్యం కేసులో ఉన్న వ్యక్తులంతా జైలు కెళ్లారని, ఈ ఏడాది భూ అక్రమార్కుల వంతు అని అన్నారు. అదే విధంగా రెవెన్యూ వ్యవస్థ పూర్తి స్థాయిలో ప్రజలకు అనుకూలంగా మార్చేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామని, ఈ ఏడాది మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఉద్యోగుల పని విధానాన్ని మెరుగుపరిచేందుకు సర్ ప్రైజ్ విజిట్స్ చేస్తామని చెప్పారు. అయితే క్షేత్ర స్థాయి సిబ్బంది కొరత కొంత మేరకు ఉందని, వార్డు సచివాలయాలు, గ్రామ సచివాలయాల్లోని అదనపు ఉద్యోగులను రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు ఒక కమిటీ నియమించినట్లు చెప్పారు. శుక్రవారం నుండి తొమ్మిదో తేదీ వరకు 21 లక్షల 80 వేల కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. తొమ్మిదో తేదీన ఏదోకచోట పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారని తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖలోనూ చాలా మార్పులు తెస్తున్నామని చెప్పారు. నకిలీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను రద్దు చేసే అధికారం కలెక్టర్లకు ఇస్తున్నట్లు చెప్పారు. డబుల్ రిజిస్ట్రేషన్ను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. అందుకే ఈ ఏడాది భూ నామా సంవత్సరంగా తాను బావిస్తున్నట్లు చెప్పారు. రెవెన్యూ ఫిర్యాదులకు సంబంధించి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపిస్తామని, అయితే చాలా అంశాలు రెవెన్యూ పరిధిలో లేనివి వస్తున్నాయని చెప్పారు. ఏఐ, బ్లాక్ చెయిన్ టెక్నాలజీని ఉపయోగించి భూ వివాదాలను జీరో స్థాయికి తీసుకొచ్చేలా పాలన చేస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## చంద్రబాబు ఒక రాజనీతిజ్ఞుడు

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పై ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఏపీలోని కూటమి ప్రభుత్వంపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించాయని, అవి దుర్మార్గమైనవని మండిపడ్డారు. గురువారం నెల్లూరులో మీడియాతో మాట్లాడిన ఆయన, కేసీఆర్ వ్యాఖ్యలకు ఘాటుగా బదులిచ్చారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక రాజనీతిజ్ఞుడు అని ప్రపంచ మంతా కీర్తిస్తోంది. అలాంటిది... కేసీఆర్‌కు నచ్చితే ఎంత? నచ్చకుపోతే ఎంత?" అంటూ ఆనం మండిపడ్డారు. రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో సుపరిపాలన అందిస్తున్నామని, దీన్ని ఎవరూ అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు నిస్సిగ్గుగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని, కొందరు నాయకులు సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రామరాజ్యం ప్రారంభమైందని అన్నారు. తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో ఇంతటి సుపరిపాలన చూడలేదని, కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

కేసీఆర్ ఏమన్నారంటే...!

ఇటీవల బీఆర్ఎస్ నేతలతో సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన కేసీఆర్, తెలంగాణలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూనే.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా, పెట్టుబడుల ఆకర్షణ కోసం నిర్వహించే సదస్సులు, చేసుకునే అవగాహన ఒప్పందాల (ఎంవోయూ) విషయంలో చంద్రబాబు అనుసరించిన వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు."రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు బిజినెస్ మీట్‌లు పెట్టడం, ఎంవోయూలు చేసుకోవడం సహజం. కానీ, గ్లోబల్ సమ్మిట్ పేరుతో దీనికి అనవసరమైన హైప్ క్రియేట్ చేయడం దేనికి? ఈ హైప్ కల్చర్‌కు ఆద్యుడు చంద్రబాబే కదా?" అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత ఏపీ సీఎంగా చంద్రబాబు ఉన్నప్పుడు కుదిరిన ఒప్పందాలపై కేసీఆర్ ఘాటుగా స్పందించారు. "చంద్రబాబు చెప్పిన లెక్కల ప్రకారం చూస్తే, ఈపాటికి ఆంధ్రప్రదేశ్‌కు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రావాలి. కానీ కనీసం రూ.10 వేల కోట్లు కూడా రాలేదు" అని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలోనే విశాఖలో జరిగిన ఓ పారిశ్రామిక సదస్సు గురించి కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు తొలిసారి సీఎంగా ఉన్నప్పుడు విశాఖలో జరిగిన సదస్సులో ఎంవోయూలపై ఎవరు సంతకాలు పెట్టారో తెలుసా? వంట మనుషులు! స్టార్ హోటళ్లలో పనిచేసే వంటవాళ్లు, సప్లై చేసేవాళ్లతో సంతకాలు పెట్టించారు" అంటూ వ్యాఖ్యానించారు. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల హామీలు ఇచ్చి, కనీస పెట్టుబడులు కూడా రాబట్టలేకపోయారని విమర్శించారు.

## ఏపీపై కాంగ్రెస్ ఫోకస్

**విజయవాడ**

ఏపీపై కాంగ్రెస్ హై కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది. వచ్చే ఎన్నికల నాటికి బలంగా ఉనికి చాటాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఎందుకంటే ఏపీ అసెంబ్లీతో పాటే సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఆ సమయానికి పార్టీ బలం పుంజుకునేలా చేయాలన్నది అధినాయకత్వం ఆలోచన. ముఖ్యంగా ఏపీ పర్యవేక్షణ బాధ్యతలను ప్రియాంక గాంధీ చూస్తున్నారు. ఆమె నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనించి మార్పులు చేర్పులు చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా షర్మిలను తొలగించి కొత్త నాయకత్వాన్ని తెరపైకి తెస్తారని తెలుస్తోంది. ప్రముఖంగా ఓ కాపు నేత పేరు వినిపిస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వానికి ఏపీ నుంచి అధిక మద్దతు ఉంది. ఇక్కడ ప్రభావం చూపిస్తే ఎన్డీఏ కు ధీటుగా కాంగ్రెస్ పార్టీని నిలపవచ్చున్నది అధినాయకత్వం ఆలోచన.2024 ఎన్నికలకు ముందు వైఎస్ షర్మిలకు కాంగ్రెస్ రాష్ట్ర బాధ్యతలు అప్పగించారు. కానీ ఆమె వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళుతున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. పైగా ఏపీలో ఎన్డీఏ కూటమి ఉంది. దానికి ధీటుగా వెళ్లాల్సిన షర్మిల జగన్మోహన్ రెడ్డిని వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకున్నారు. అయితే గతంలో కాంగ్రెస్ పార్టీని జగన్ దెబ్బతీసి ఉన్నందున కాంగ్రెస్ హై కమాండ్ కూడా షర్మిలను ప్రోత్సహించింది. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డిని షర్మిల టార్గెట్ చేయడం కాంగ్రెస్ హై కమాండ్ కు నచ్చలేదు. అందుకే ఆమె స్థానంలో కొత్త నేతను రంగంలోకి దించనున్నట్లు సమాచారం. అది కూడా భవిష్యత్తు ఆలోచనతోనే ఆ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. షర్మిల ఉంటే జగన్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ వైపు చూడరు. భవిష్యత్తులో జగన్ కాంగ్రెస్ పార్టీ వైపు చూసేలా కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించినట్లు సమాచారం.కాంగ్రెస్ పార్టీకి అధినాయకులుగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఉన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. అందుకే జాతీయస్థాయిలో బలోపేతం చేయాలంటే ఈ ముగ్గురు నేతలు తలో రాష్ట్రాల పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవాలి.

# సంబరం.. గిరిజన యువ సమ్మేళనంలో అంబరం

## - ఆకట్టుకున్న గిరిజన సంప్రదాయ నృత్యాలు







**(అంకుశం, విశాఖపట్నం, జనవరి 1):** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మరియు క్రీడల మంత్రిత్వశాఖ ఆ్యదఅ ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న 17వ గిరిజన యువ సమ్మేళనంలో గురువారం యువత సాంస్కతిక ప్రదర్శనలతో ఉత్సాహం అంబరాన్ని తాకింది. ఝూర?ండ్, ఛత్తీస్‌గడ్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన గిరిజన యువత ఈ కార్యక్రమంలో పోటాపోటీగా తమ సంప్రదాయ వేషధారణతో సాంస్కతిక ప్రదర్శనలను ఇచ్చారు. రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణతో, ఉత్సాహభరతమైన నత్యాలతో విద్యార్థులు తమ గిరిజన సంస్కతి మూలాలను చాటి చెప్పారు. పంటలు చేతికి వచ్చే సమయంలో పాడుకునే సంప్రదాయ గీతాలు, నత్యాలతో పాటు వివాహ కార్యక్రమాలలో చేసే పెళ్ళి సందడి పాటలు, ప్రకతిని ఆరాధిస్తు స్త్రీ, పురుషులు కలిసి చేసే వన మహోత్సవాలను వేధికపై ప్రదర్శస్తూ వాటి ప్రాధాన్యతను వివరించిన తీరు ఆకట్టుకుంది. డిజిటల్ యుగంలోను తమ సాంస్కతిక గుర్తింపును గిరిజన యువత ఎలా పరిరక్షించుకుంటూన్నారో ఈ ప్రదర్శనలు స్పష్టంగా చూపించారు, గిరిజన సంప్రదాయ వేషధారణలో చేసిన ఆత్మీయ సంగీతం, లాయాత్మక నత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశాయి. వేణువు, డప్పులు వంటి సంప్రదాయ వాద్యాలు ఈ ప్రదర్శనలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మైభారత్ (నెహ్రూ యువకేంద్ర సంఘటన్) విశాఖపట్నం ఉప డైరక్టర్ జి.మహేశ్వరరావు, సీనియర్ పాత్రికేయుడు ఎన్.నాగేశ్వరరావు పలువురు అధికారులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# నంద్యాలలో రాజకీయ నాయకులు అధికారుల ఇళ్ల వద్ద సందడి

## - రాజకీయ నాయకులకు,అధికారులకు ..నూతన సంవత్సర శుభాకాంక్షలు





**అంకుశం ప్రతినిధి నంద్యాల జనవరి 1 :** నంద్యాల నియోజకవర్గ నంద్యాల నగరంలో రాజకీయ నాయకులు అధికారులు ఇండ్ల వద్ద నూతన సంవత్సర వేడుకల సందడి కనపడింది నాయకులు అధికారులు పెద్ద ఎత్తున తరలివచ్చ నంద్యాల పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు అట్టహాసంగా జరిగాయి. రాజకీయ నాయకులు,అధికారులను ప్రజలు, అభిమానులు,సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు .న్యూ ఇయర్ వేడుకలు అంటేనే యువతలో జోష్ నింపుతుంది.డిసెంబర్ 31 న ఎవరికి వారు పార్టీలతో బిజి అయిపోయారు.పట్టణంలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పోలీస్ శాఖ వారం నుంచే ప్రజలకు జాగ్రత్తలపై ప్రచారం నిర్వహించారు.మద్యం మత్తులో అల్లర్లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.పోలీస్ శాఖ ఇచ్చిన సూచనల మేరకు 31 రాత్రి ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోలేదు.కొందరు న్యూ ఇయర్ కు స్వాగతం పలుకుతూ టపాసులు కాల్చి స్వాగతం పలికారు. న్యూ ఇయర్ సందర్భంగా దేవాలయాలు కిటకిటలాడాయి.బట్టల దుకాణాలు,కేకులు,మద్యం దుకాణాల్లో వ్యాపారాలు ఫుల్ గా సాగాయి.జనవరి 1 సందర్భంగా నేతలు,అధికారులు పూలమాలలు,బోకేలు తీసుకొని రావద్దు ,పిల్లలు,విద్యార్థులకు అవసరమయ్యే పుస్తకాలు, పెన్సిల్స్, పెన్నులు తీసుకొని రావాలని చెప్పడంతో కొందరు వాటితో పాటు పూలదండలు, బోకేలు,శాలువాలు, స్వీట్స్ ,పండ్లు తీసుకుని తమ అభిమాన నేతలకు,అధికారులకు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్, ఫిరోజ్, ఫయాజ్, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి,మార్క్ ఫెడ్ డైరెక్టర్, సీనియర్ న్యాయవాది తాతిరెడ్డి తులసిరెడ్డి, జన సేన నాయకులు భవనాసి వాసు,జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎస్పీ,డీఎస్పీ, సీఐ,సబ్ ఇన్స్పెక్టర్,మున్సిపల్ కమిషనర్,డిస్ట్రిక్ ట్రాన్స్ పోర్ట్ అధికారి,సబ్ రిజిస్టర్, అర్బన్,రూరల్ తహశీల్దార్ లతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వి బి జి రాంజీ కి రామ్ రామ్! కూటమికి మరణ శాసనం!

## - కెవి రమణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక

**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 1:** కేంద్ర ప్రభుత్వం ఎంజిఎన్ఆర్ఇజిఎ ను అంచలంచలుగా రద్దు చేయడం కోసమే పేరు మార్పు, అని అందరూ అనుకున్నట్లుగానే ఎస్ బిఐ రీసెర్చ్ నివేదిక అదే నిజమని రుజువు చేసింది. అని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి రమణ అన్నారు ఇందుకు సంబంధించిన నివేదిక వివరాలను కేవి రమణ మీడియాకు పంపించారుఈ నివేదిక ప్రకారం ఈ పథకం అమలు జరగాలంటే 7 ప్రామాణికాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పింది.అందులో ముఖ్యమైనది జనాభా ప్రాతిపదిక,మరియు వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల సంఖ్యను బట్టి నిధులు కేటాయించడం.వీటి ప్రకారమే అయితే అతి తక్కువ వర్షపాతం కలిగి, అత్యంత వెనుకబడిన ప్రాంతాలు, వలసలు, ఆకలి చావులు సంభవిస్తున్న దక్షిణ భారత దేశంలోనే ఈ పథకం మొదటగా లేకుండా పోతుంది. కుటుంబ నియంత్రణ పాటించిన దక్షిణ భారతదేశం ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నది .దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్,తమిళనాడు రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉన్నది. ఉపాధి హామీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఎం జి ఎన్ఆర్ఈజీఏ కు కేటాయిస్తున్న బడ్జెట్ ప్రకారమే ఆంధ్రప్రదేశ్ దాదాపు 200 కోట్లు, తమిళనాడు 900 కోట్లు నష్టపోయే ప్రమాదం ఉన్నదని ఆ నివేదిక చెబుతున్నది. ప్రస్తుతం అమలు జరుపతల పెట్టిన విబి జి రామ్ జి పథకం ద్వారా నిధులు మరింత తగ్గిపోయే పరిస్థితులు దాపురిస్తాయి, ఇది మూలిగే నక్క పై తాటికాయ పడ్డట్టు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం చీలిపోయి గొంతులలోతు కష్టాల్లో ఉన్న తరుణంలో విబీజిరాంజీ పథకం ద్వారా 40% నిదులను భరించడంతోపాటు కేంద్ర నిధులు తగ్గిపోవడం అంటే ఈ రాష్ట్రంలో సమూలంగా ఈ పథకాన్ని ఎత్తివేయడమే.కూటమి ప్రభుత్వానికి మరణ శాసనమే.

ఎక్కడైతే దేశంలోనే మొట్టమొదట కేంద్ర ప్రభుత్వం కక్షపూరితంగా ఎంజీఎన్ఆర్ఇజిఎ పథకాన్ని ప్రారంభించారో అదే రాష్ట్రంలోనే ఈ పథకం దేశంలోనే మొట్టమొదటగా రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్లు కనబడుతుంది.ఎక్కడ పోగొట్టుకున్నారో అక్కడే వెతుక్కోమన్నది ఒకనాటి మాట ,ఎక్కడ ప్రారంభించారో అక్కడే రద్దు చేయడమన్నది నేటి మాట.అందువల్ల ఈ చట్టాన్ని శాశ్వతంగా నిలుపుకోవాలంటే ప్రజలు తిరుగుబాటు చేయాలి, అందులకు విద్యావంతులు, మేధావులు, సంఘసంస్కర్తలు, స్వఛ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీలు, ముందు వరుసలో నిలబడాలి. అని రమణ అన్నారు

# చెత్త రహిత రాష్ట్రంగా ఏపీ

- 'స్వచ్ఛ ఆంధ్ర అమల్లో విజయవంతం
- నూతన సంవత్సర వేడుకల్లో 'స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



**(అంకుశం, అమరావతి, జనవరి 1):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' (ఎస్ఏఎస్ఏ) కార్యక్రమాలు రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు స్వఛ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. అమరావతిలోని స్వఛ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కేక్ కట్ చేసి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ పట్టాభి రామ్, కార్పొరేషన్ ఎండీ బి. అనిల్ కుమార్ రెడ్డి ఒకరికొకరు కేక్ తినిపించుకున్నారు. అధికారులు అందరికీ పట్టాభిరామ్ కేక్ తినిపించారు. అధికారులు, సిబ్బంది చైర్మన్ పట్టాభిరామ్ కు పూల మొక్కలు, పూల గుత్తులు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వంలో ఏ విభాగానికి దక్కని గౌరవం మన 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' ఆంధ్ర'కార్యక్రమానకి దక్కిందన్నారు. నెలలో ప్రతి మూడవ శనివారం సీఎం మనకు కేటాయించి, మన కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా పారిశుద్ధ్యానికి ఆయన ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేసి, డంప్ యార్డ్ ఫ్రీ(చెత్త రహిత) రాష్ట్రంగా రూపొందిస్తామని పట్టాభిరామ్ చెప్పారు. కార్పోరేషన్ ఏర్పడిన తర్వాత మన మనమంతా ఒక కుటుంబ సభ్యులులా కలిసి పారిశుద్ధ్యం పట్ల ప్రజలలో అవగాహన కల్పిస్తూ, వారిలో చైతన్యాన్ని తీసుకురావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్పోరేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో 2025లో మనం అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామన్నారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమానికి గట్టి పునాది ఏర్పడిందని చెప్పారు. 2026లో ఈ కార్యక్రమాలను మనం ఇంకా విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్పొరేషన్ సీఈ వేణుగోపాల్, జేడీ భాగ్యలక్ష్మి, సీఓఓ దశరథ రామిరెడ్డి, ఈడీలు ఊర్మిళ, అర్జునరావు, ఎఫ్ఎం విజయశేఖర్, ఈఈ సుహాసిని, డీఈలు జయదేవ్, సతీష్, లక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



**అంకుశం న్యూస్ ధర్మవరం, జనవరి 01:** ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు గారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడానికి ధర్మవరం నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజలు, బీజేపీ పార్టీ నాయకులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వచ్చిన వారు హరీష్ బాబు గారిని పుష్పగుచ్ఛాలేతో, శాలువాలతో ఘనంగా సత్కరించి, పుస్తకాలు, పెన్నులు, పూల మొక్కలు, ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయం అంతా పండుగ వాతావరణాన్ని తలపిస్తూ ఉత్సాహంగా మారింది. నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుతూ, కొత్త సంవత్సరాన్ని ఆశావహంగా స్వాగతించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ...., నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలు, కొత్త అవకాశాలను తీసుకురావాలి. ధర్మవరం నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదాలతో, పార్టీ శ్రేణుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం మరింత కట్టుబాటుతో పని చేస్తాం. ప్రజలకు మరింత చేరువగా ఉండే విధంగా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తాం అని తెలిపారు. అలాగే ధర్మవరం నియోజకవర్గ ప్రజలందరికీ, బీజేపీ పార్టీ నాయకులకు, ఎన్డీఏ కూటమి నాయకులకు, కార్యకర్తలందరికీ నూతన సంవత్సర ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆపరేషన్ సిందూర్ తో డీఆర్డీవో ఆయుధాల సత్తా ఏంటో అందరికీ తెలిసింది

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో) 68వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంస్థ సేవలను కొనియాడారు. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' సమయంలో డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఆయుధ వ్యవస్థలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయని, మన దేశీయ ఆయుధాల సత్తా ఏంటో ప్రపంచానికి తెలిసిందని అన్నారు. ఇది సంస్థ నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గురువారం ఢిల్లీలోని డీఆర్డీవో ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన 'సుదర్శన చక్ర' రూపకల్పనలో డీఆర్డీవో కీలక పాత్ర పోషించనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కింద దేశంలోని కీలక సంస్థాపనలకు పూర్తిస్థాయి వైమానిక రక్షణ కల్పించే బాధ్యతను డీఆర్డీవోకు అప్పగించినట్లు తెలిపారు. ఆధునిక యుద్ధంలో ఎయిర్ డిఫెన్స్ ప్రాముఖ్యతను ఆపరేషన్ సిందూర్ సమయంలో చూశామని, ఈ లక్ష్యాన్ని డీఆర్డీవో త్వరగా సాధిస్తుందని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో, సాయుధ బలగాలకు అత్యాధునిక సాంకేతికతను అందించడంలో డీఆర్డీవో చేస్తున్న కృషి అమోఘమని అన్నారు. డీఆర్డీవో శాస్త్రవేత్తల అచంచలమైన నిబద్ధత, శాస్త్రీయ నైపుణ్యం దేశ రక్షణ సన్నద్ధతకు మూలస్తంభాలని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగం, విద్యాసంస్థలు, స్టార్టప్‌లతో కలిసి పనిచేయడం ద్వారా దేశంలో ఒక బలమైన రక్షణ పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతోందని అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆవిష్కరణలపై దృష్టి సారిస్తూ, ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని మరింత పెంచే మార్గాలను అన్వేషించాలని ఆయన సూచించారు. నిరంతరం నేర్చుకుంటూ, భవిష్యత్ టెక్నాలజీలకు అనుగుణంగా సన్నద్ధంగా ఉండాలని డీఆర్డీవో శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు.

## ఫాస్టాగ్‌లపై కేంద్రం శుభవార్త... వాహనదారులకు భారీ ఊరట

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్లు, జీపులు, వ్యాన్‌లకు సంబంధించిన ఫాస్టాగ్‌ల కోసం 'నో యువర్ వెహికల్' ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ గురువారం ప్రకటించింది. ఈ కొత్త నిబంధన ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ నిర్ణయంతో లక్షలాది మంది వాహనదారులకు పెద్ద ఊరట లభించనుంది. ఫాస్టాగ్ యాక్టివేట్ అయిన తర్వాత కేవైవీ పేరుతో ఎదురవుతున్న ఇబ్బందులు, జాప్యాన్ని నివారించేందుకే ఈ సంస్కరణ తీసుకొచ్చినట్లు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు ఉన్నప్పటికీ, కేవైవీ అప్‌డేట్ కాలేదన్న కారణంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని, తాజా నిర్ణయంతో ఆ సమస్యలు తొలగిపోతాయని పేర్కొంది. కొత్త ఫాస్టాగ్‌లకే కాకుండా, ఇప్పటికే జారీ చేసిన ఫాస్టాగ్‌లకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. అయితే, ఫాస్టాగ్ దుర్వినియోగం, తప్పుగా జారీ చేయడం వంటి నిర్దిష్ట ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే కేవైవీ అవసరమవుతుందని చీనాా× స్పష్టం చేసింది. ఎలాంటి ఫిర్యాదులు లేని పాత ఫాస్టాగ్‌లకు కేవైవీ తప్పనిసరి కాదు. వినియోగదారులకు ప్రక్రియను సులభతరం చేస్తూనే, వ్యవస్థలో పారదర్శకత, కచ్చితత్వాన్ని పెంచేందుకు చీనాా× చర్యలు చేపట్టింది. ఇకపై ఫాస్టాగ్ యాక్టివేషన్‌కు ముందే వాహన్ డేటాబేస్ నుంచి వాహన వివరాలను ధృవీకరించుకోవాలని బ్యాంకులకు కఠిన నిబంధనలు విధించింది. ఒకవేళ వాహన్ పోర్టల్‌లో వివరాలు లేకపోతే, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (=జ) ద్వారా సరిచూసుకున్న తర్వాతే ఫాస్టాగ్‌ను యాక్టివేట్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో విక్రయించే ఫాస్టాగ్‌లకు కూడా ఇదే నిబంధన వర్తిస్తుంది. ఈ మార్పులతో వెరిఫికేషన్ బాధ్యత పూర్తిగా బ్యాంకులపైనే ఉంటుందని, వినియోగదారులకు ఇబ్బందులు లేని ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యమని చీనాా× తెలిపింది.

## అత్యాధునిక హంగులతో వందే భారత్ స్లీపర్..

దేశంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న వందే భారత్ స్లీపర్ రైలు పరుగులకు సిద్ధమైంది. ఈ రైలుకు సంబంధించిన తొలి రూట్‌ను కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈరోజు అధికారికంగా ప్రకటించారు. అస్సాంలోని గువాహటి నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలు నడవనుందని ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఈ రైలు టెస్టింగ్, సర్టిఫికేషన్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఈ సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఇటీవల కోటా-నాగ్డా సెక్షన్‌లో నిర్వహించిన ఫైనల్ ట్రయల్ రన్‌లో ఈ రైలు గంటకు 180 కిలోమీటర్ల వేగంతో విజయవంతంగా దూసుకెళ్లింది. ఈ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉండగా.. ఇందులో 11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, ఒక ఫస్ట్ ఏసీ కోచ్ ఉన్నాయి. ఒకేసారి మొత్తం 823 మంది ప్రయాణించేలా దీనిని రూపొందించారు. వ్యాపారవేత్తలు, కుటుంబాలు, విద్యార్థులతో పాటు పర్యాటకులకు ఈ రాత్రిపూట ప్రయాణం (ఓవర్‌నైట్ జర్నీ) ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. టికెట్ ధరల విషయానికొస్తే.. ఆహారంతో కలిపి థర్డ్ ఏసీకి సుమారు రూ. 2,300, సెకండ్ ఏసీకి రూ. 3,000, ఫస్ట్ ఏసీకి రూ. 3,600గా ఉండనున్నట్లు సమాచారం. ప్రయాణికుల భద్రత, సౌకర్యాలకు పెద్దపీట వేస్తూ ఈ రైలును తీర్చిదిద్దారు. ఎర్గోనామిక్ బెర్తులు, ఆటోమేటిక్ డోర్లు, అత్యాధునిక లైటింగ్, శబ్దం రాకుండా ప్రత్యేక చర్యలు, కవచ్ యాంటీ కొలిజన్ సిస్టమ్ వంటి ఆధునిక హంగులు ఇందులో ఉన్నాయి. వరల్డ్ క్లాస్ సౌకర్యాలతో కూడిన ఈ వందే భారత్ స్లీపర్.. రాత్రి ప్రయాణాల్లో ప్రయాణికులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుందని రైల్వే శాఖ తెలిపింది.

## రికార్డు స్థాయిలో జీఎస్టీ ఆదాయం... డిసెంబరులో భారీ వసూళ్లు

దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిని సూచిస్తూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకమైన వృద్ధిని నమోదు చేశాయి. 2025 డిసెంబరు నెలలో జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,74,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. 2024 డిసెంబరులో నమోదైన రూ.1,64,556 కోట్లతో పోలిస్తే ఇది 6.1 శాతం అధికం కావడం గమనార్హం.

# దాతల సహకారం మరువలేనిది

**- మానవత జిల్లా చైర్మన్ పాలుగుళ్ల శివారెడ్డి**



**అంకుశం న్యూస్ ప్రకాశం జనవరి 1:** ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణంలోని కాశినాయనగర్ లో వెలసి ఉన్న శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన ఆశ్రమం నందు ప్రతి బుధవారం దాతల సహకారంతో అన్న వితరణ ఏర్పాటు చేయడం జరుగుతుంది. పండితులు కృష్?మూర్తి చే దాతల కుటుంబాల పేర్లమీద అర్చన కాశినాయనకు అభిషేకం పూజ చేయడం జరిగింది. ఈ బుధవారం దాత ఉడుముల సుధాకర్ రెడ్డి వారి తల్లిదండ్రుల స్వర్గీయ తిరుపతిరెడ్డి స్వర్గీయ ధనలక్ష్మి జ్ఞాపకార్థం కాశినాయన దగ్గర భోజనం ఏర్పాటు చేశారు. ఉడుముల సుధాకర్ రెడ్డి గారికి శ్రీ శ్రీ భగవాన్ కాశిరెడ్డి నాయన అన్న వితరణ సేవాశ్రమం తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి బుధవారం దాతలు అందిస్తున్న ఆర్థిక సహాయ సహకారాలు మరువలేనిది అంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు.దాతలు ముందుకు రావాలని స్వఛ్ఛందంగా మీరే వచ్చి వండి వడ్డించాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్ వారు కోరారు ఈ కార్యక్రమంలో విశ్రాంత లెక్చరర్ మానవత ప్రకాశం జిల్లా చైర్మన్ పాలుగుళ్ల శివారెడ్డి, విశ్రాంత సూపర్నెంట్ పాలుగుళ్ళ కాశిరెడ్డి, విశ్రాంత లెక్చరర్ వినియోగదారుల సంఘం చైర్మన్ వడ్డి వీరారెడ్డి, బిజెపి లీడర్ పిడతల రమేష్ రెడ్డి, టీ కొట్టు నారాయణమ్మ, చిల్లర కొట్టు లక్ష్మీదేవమ్మ, ఓబులమ్మ, విశ్రాంత జిల్లా సర్వేయర్ రెడ్డి మల్లారెడ్డి, విశ్రాంత టీచర్ శ్రీరాములు, ఆర్టీసీ వెంకటేశ్వర్లు గౌడ్, హెూమియోపతి డాక్టర్ గోపాల్ రెడ్డి, కాశి నాయన భక్తులు పాల్గొన్నారు.

# పరిటాల సునీత మరిదికి కన్నీటి వీడ్కోలు

**- అమెరికాలో గుండెపోటుతో మృతి చెందిన గుంటూరు రామాంజనేయులు**


**- గురువారం ఉదయం బెంగళూరుకు పార్థివదేవం, అక్కడే అంత్యక్రియలు**






**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 1:**రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మరిది (చెల్లెలు భర్త) గుంటూరు రామాంజనేయులుకి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆత్మకూరు మండలం, పి.సిద్దరాంపురం గ్రామానికి చెందిన గుంటూరు రామాంజనేయులు గత నెల 24వ తేదిన అమెరికాలో గుండెపోటుతో మరణించారు. పరిటాల సునీత చెల్లెలు లక్ష్మీ భర్త అయిన రామాంజనేయులు దంపతులు బెంగళూరులో స్థిరపడ్డారు. వారి పెద్ద కుమారుడు మంజునాథ్ కు ఇటీవల కుమారుడు జన్మించగా గత నెల 13వ తేదీన రామాంజనేయులు దంపతులు అమెరికా వెళ్లారు. కుటుంబ సభ్యులంతా సంతోషంగా గడుపుతున్న సమయంలో.. రామాంజనేయులు 24వ తేదీ హఠాత్తుగా గుండెపోటుతో మరణించారు. అమెరికా నుంచి రామాంజినేయులు పార్థివదేహం గురువారం తెల్లవారుజామున బెంగళూరులోని కెంపాపుర లోని రాయల్ ఎన్ క్లేవ్ లే అవుట్ లో ఉన్న ఆయన నివాసానికి చేరుకుంది. అక్కడ ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ నివాళులర్పించారు. రామాంజనేయులుతో ఉన్న అనుబంధాన్ని వారు గుర్తు చేసుకున్నారు. వీరితో పాటు పరిటాల, ధర్మవరపు, గుంటూరు వారి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు హెబ్బాల్ సమీపంలోని ఎస్టీమ్ మాల్ ప్రక్కన ఉన్న హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు....

# వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఇంటి వద్ద సందడి





**- భారీగా హాజరైన కార్యకర్తలు నాయకులు పార్టీలకు అతీతంగా శుభాకాంక్షలు విలువ**

**- ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి**

**- వైకుంఠం ప్రభాకర్ చౌదరి**

**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 1:**అనంతలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఇంటి వద్ద సందడి నెలకొని ఉంది పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు స్వఛ్ఛంద సంస్థలు వివిధ రాజకీయ పార్టీల నాయకులు తరలివచ్చి వైకుంఠం ప్రభాకర్ చౌదరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు అధికారం లేకపోయినా పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలిరావడం తెలుగుదేశం పార్టీలో పెద్ద ఎత్తున చర్చని అంశమైంది ఈ సందరరేగా వైకుంఠం ప్రభాకర్ చౌదరి కార్యకర్తలను నాయకులు ఉద్దేశించి మాట్లాడుతూనూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని రైతులు యువత అన్ని వర్గాల ప్రజలు రాబోవు రోజుల్లో వారందరికీ మంచి జరగాలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు .తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అనంతపురం అర్బన్ మాజీ శాసనసభ్యులు వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపిన సిరిగిరి నారాయణస్వామి. ఈ సందరరేగా నారాయణస్వామి మాట్లాడుతూ... వెనకబడిన బేడ బుడగ జంగం కులం అభివృద్ధికి లివైకుంఠం ప్రభాకర్ చౌదరి లి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కొత్త సంవత్సరం కచ్చితంగా వైకుంఠం ప్రభాకర్ చౌదరి గారికి కలిసి రావాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు..ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చౌదరి మహేష్ సర్దార్ రాసుట్టి కుల్లాయప్ప మోతి సుంకన్న.శిరిశాల రమేష్ మోతి మాధవ, మోతి రాజేష్, సిరిగిరి మారి, మోతి రమణ, ధూపం అంజి, మోతి లోకేష్, మోతి కుల్లాయప్ప, మధు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు శివా గ్రీన్ వ్యాలీ లో అంబరాన్ని తాకిన నూతన సంవత్సర సంబురాలు

**- సిల్వెస్టర్ కు ఘన సత్కారం**




**అంకుశం ప్రతినిధి గుంటూరు, జనవరి 1:**గుంటూరు నగరంలోని అతి పెద్ద కాలనీల్లో ఒకటైన గోరంట్లలోని ' శివా గ్రీన్ వ్యాలీ ' లో గత రాత్రి నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని తాకాయి. తొలుత మిమిక్రీ స్టార్ సిల్వెస్టర్ చే మిమిక్రీ, వెంట్రిలాక్విజం బొమ్మతో చిన్నారులచే మాట్లాడించటం జరిగింది. తదుపరి ఆవుల రాము బృందం చే సంగీత కార్యక్రమాలు, కాలనీ బాల బాలికలతో నృత్య కార్యక్రమాలు జరిగాయి. ఈ సందరరేగా కాలనీ అధ్యక్షులు కందుల యుగంధర్, కార్యదర్శి సోదా శివరాం, ఉపాధ్యక్షులు రమణమూర్తి, సంయుక్త కార్యదర్శి నరసింహ స్వామి, కాలనీ పెద్దలు గుంజుపల్లి భాస్కర్ తో పాటు సిల్వెస్టర్ కు అత్యంత సన్నిహితులైన సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, తూములూరి రాజేంద్రప్రసాద్ లు సిల్వెస్టర్ ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. దాదాపు 11 వేల కార్యక్రమాలను నిర్వహించిన సిల్వెస్టర్ ను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ' పద్మశ్రీ ' అవార్డు తో సత్కరిస్తే ఆ కళనే గౌరవించినట్లు కాగలదంటూ వక్తలు ప్రస్తావించారు.

## నూతన సంవత్సరం అందరికి సంతోషం నింపాలి.

**- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి.**



**అంకుశం న్యూస్ కర్నూల్ జనవరి 1:** ఈ నూతన 2026 వ సంవత్సరం అందరి కుటుంబాలలో సంతోషం నింపాలని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం కర్నూలు బైరెడ్డి రాజశేఖరరెడ్డి స్వగృహంలో 2026 వ నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల, పాణ్యం, శ్రీశైలం, నందికొట్కూరు, డోన్, బనగానపల్లె నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బైరెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో గజ మాలలు, అందమైన పూల బొక్కేలు, వివిధ రకాల పండ్లతో తరలివచ్చి మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి బాటలో పయనించాలని, సీఎం చంద్రబాబుతో రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలని, ఈ ఏడాది అందరికి మంచి జరగాలని కోరుకుంటున్నానని బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు.



మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

## వై ఎస్ ఆర్ పార్టీ కార్యాలయం లో నూతన సంవత్సర వేడుకలు!



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 1:** ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి గృహం లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే పి ఏ గుర్రం శ్రీ నివాస రెడ్డి ఆధ్వర్యంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమం లో చందమూరి నారాయణ రెడ్డి, మాసపల్లి సాయి కుమార్ వి. జయరాం రెడ్డి, చాంద్ భాష, భాస్కర్ రెడ్డి, చెలిమి రామయ్య సంద్ర రమేష్ రాయల్,దేవరకొండ రమేష్ మిద్దె సురేష్,కునుతురు గోపాల్ చౌడప్ప, అమర్ నాథ్ రెడ్డి, సాకే వెంకటేష్, పురుషోత్తం రాయల్ సుబ్రహ్మణ్యం కుళ్లాయప్ప సీనా,తదితరులు పాల్గొన్నారు.

## చేనేత దాతలకు సన్మానం!



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 1:** ధర్మవరం శ్రీ శాంతకళా చౌడేశ్వరి దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో పేద చేనేత కార్మికులకు నెల నెల రూ 200 చొప్పున అనేకమంది కి ఆర్థిక సహాయం అందిస్తూ ఈసందర్భంగా చేనేత దాతలను దాసరి వెంకటేష్ (చిట్టి ) ఘనంగా సన్మానించారు. అదేవిదంగా ప్రతి నెల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తూ మందులను ఉచితంగా ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దాసరి చిట్టి 135 మందికి ఈ ఆర్థిక సహాయం చేయగా మిగతా వారు దాసరి నారాయణ బండారు సూరి చందా ప్రవీణ్ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.వారిని పేరు పేరునా దాసరి చిట్టి అభినందించారు. ఘనంగా సన్మానం చేశారు.

## కందికుంట వెంకటప్రసాద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ధర్మవరం టీడీపీ నేతలు



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 1:** కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నేతలు నాగూర్ హుసేన్ నీలయ్య గారి ఫణి కుమార్ ధర్మవరం టీడీపీ నేతలు పలువురు కదిరి కి వెళ్లి ఎమ్మెల్యే కందికుంట నివాసం లో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి సవిత



**అంకుశం న్యూస్ పెనుగొండ జనవరి 1:** శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ లోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవిత గారు ఇరిగేషన్ SE స్వరూప్, ఇంజనీర్లు శ్రీ మురళి, శ్రీనివాస్ తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందరరేగా మంత్రి మాట్లాడుతూ, నియోజకవర్గంలో మిగిలిన చెరువులు, తక్షణమే నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పరిగి చెరువు అంశంపై చర్చించారు. కొగిర,చాలకురు పెనుకొండ చెరువులకు ఫీడర్ చానల్ ఏర్పాటు మరియు గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణం గురించి చర్చించారు.రాబోయే వేసవిలో తాగునీరు, సాగునీటి కొరత లేకుండా ఉండేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖకు చెందిన ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు..



## పేద చేనేత కార్మికులకు సహాయం చేయు దాతలకు ఘన సత్కారం..

**- క్యాంపు చైర్మన్ దాసరి వెంకటేశులు (చిట్టి)**



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 1ఫ** పట్టణంలోని తొగట వీధిలో గల శ్రీ శాంత కళా చౌడేశ్వరి దేవి ఆలయంలో గత కొన్ని సంవత్సరాలుగా దాతల సహకారంతో వృద్ధులకు, అనాధలకు, ఒంటరి మహిళలకు నెలకు 200రూపాయలు చొప్పున పింఛను పంపిణీ చేస్తున్నామని క్యాంపు చైర్మన్ దాసరి వెంకటేశులు (చిట్టి) తెలిపారు. ఈ సందరరేగా పట్టణంలోని ఆలయంలో 150 మందికి 200 రూపాయలు చొప్పున పెన్షన్ను పంపిణీ చేశారు. ఇంతవరకు దాతల సహకారంతో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఐదు మంది దాతలను ఘనంగా పింఛన్దారుల నడుమ ఘనంగా సత్కరించారు. చిట్టి మాట్లాడుతూ మేము ఇచ్చే పెన్షన్ అతి తక్కువ డబ్బు అయినా, ఏదో ఒకదానికి వాడుకునే అవకాశం నేటి కాలంలో ఉందన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఆలయం కమిటీ ఆధ్వర్యంలో కూడా ప్రతినెలా ఉచిత వైద్య శిబిరాలతో పాటు ఉచితంగా మందులను కూడా పంపిణీ చేస్తున్నట్లు వారి తెలిపారు. దాతలు మాట్లాడుతూ ఆలయ కమిటీ వారు చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలు ఎందరికో సూర్తేని ఇస్తాయని తెలుపుతూ, మమ్ములను ఈ విధంగా అమ్మవారి సన్నిధిలో సన్మానించుట అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి మంజునాథ్, చందా ప్రసాద్, బండారు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.